

# వస్తు ప్రపంచం

'యా' భై ఎనిమిదేళ్లొచ్చాయి' అంటూ ఓ చెక్కును, పూలహారాన్ని నా ముఖాన విసిరేసి "ఇక దయచెయ్" అన్నట్లుగా నన్ను రోడ్డు పైకి తోసిన ఈ ఉద్యోగ విరమణ క్షణాల్లో నా హృదయానికున్న కలల రెక్కల్ని మరోసారి ఆత్రంగా తడుముకున్నాను. అవి ఇంకా నన్నంటి పెట్టుకునే ఉన్నాయి. అల్లాఉద్దీన్ అద్భుతదీపంలా అలా స్పృశిస్తే చాలు ఎక్కడెక్కడో రంగుల లోకాల్లోకి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నాయి.

ముందీ నాటక వారోత్సవాల్లోని చివరి రోజును కూడా జయప్రదంగా ముగించాలి. ఆ తరువాతే నా లోలోపలికి ప్రయాణాలు.

ఈ నాటక వారోత్సవాలు మా ఇంటిలోనే.

మొదటి రోజు పెద్దకొడుకు వంతు.

"నాన్నగారూ! అనిల్‌గాడి భవిష్యత్తు మీ చేతుల్లో పెడుతున్నా! వాడిదో చిత్రమైన మనస్తత్వం. అచ్చు మీ పోలికే.... భావుకత్వం ఎక్కువ. రెండుసార్లు ఎంట్రెన్స్.... కొద్దిలో తప్పి పోయింది. ఈసారి రాకపోతే వాడి గుండె పగిలిపోవటం ఖాయం. గుల్బర్గాలో సీటు ఇప్పిస్తానంటున్నాడు మా ఫ్రెండొకడు. మామూలుగా అయితే లక్షన్నర. మనకు లక్షలో ఏర్పాటు చేస్తానంటున్నాడు. ఇక మీ ఇష్టం. వాణ్ణి డాక్టర్నే చేస్తారో! రోడ్డు వెంట తిరిగే జులాయినే చేస్తారో?"

రెండోరోజు పెద్దకూతురి వంతు. డైలాగులన్నీ మనవరాలివి, వెనక దర్శకత్వం కూతురిది.

"నాన్న అపురూపలో ఫ్లాట్ కొందామంటున్నాడు. లోను రెండు దాకా వస్తుంది. మరో లక్షన్నర సర్దితే మనకంటూ ఒక ఇల్లు ఉంటుంది. మీరూ, అమ్మమ్మా, ఎంచక్కా మా దగ్గరే ఉండిపోవచ్చు. మూలనున్న గది మీ కోసం అని అప్పుడే కేటాయించేశారు నాన్న. అక్కణ్ణుంచి చూస్తే నీలాకాశం, పక్షులు, పక్కింటి వాళ్ల బాదం చెట్టు కన్పిస్తాయి. మీరు ఎంచక్కా కవితలు రాసుకుంటూనో, చదువుకుంటూనో గడిపేయవచ్చు. సరేనా?"

మూడోరోజు చిన్నకూతురు, నాలుగో రోజు అఖరు కొడుకు వంతు. వాళ్ళు పెద్దగా హంగామా చెయ్యలేదు. కొత్తతరం వాళ్లు కదా! 'ఏకానమీ ఆఫ్ వర్డ్స్' మీద నమ్మకం ఉన్నవాళ్లు. తన పెళ్లికి లక్ష రూపాయిల డబ్బు విడిగా డిపాజిట్ చెయ్యాల్సిన బాధ్యతను గుర్తు చేసింది పెళ్లి కెదిగిన చిన్నకూతురు. ఉద్యోగాన్ని కొనుక్కోడానికి తనకూ డబ్బు అవసరమేనన్న విషయాన్ని చాలా విసుగ్గా, అసహనంగా తెలియజేశాడు ఆఖరి కొడుకు. ఎమ్.ఎ. ఫిలాసఫీ, దట్టమైన గడ్డం, విలువల మీద అపనమ్మకం, డబ్బుతో మాత్రమే ఉద్యోగాలు వచ్చే రోజులివి అన్న విశ్వాసం ఉన్నవాడు.

నిన్నటి రోజు శ్రీమతిది. ఆవిడదే బాగా రక్తికట్టిన నాటకం.

"మీరు పోతే నా గతేం కాను! పాపిష్టిదాన్ని! అసుర సంధ్యవేళ అనరాని మాట అంటున్నాను. కానీ కీడెంచి మేలెంచమన్నారు. ఆ తరువాత వాడింట్లోనూ, వీడింట్లోనూ అంట్లు తోముకుంటూనో, కసువులు ఊడ్చుకుంటూనో దినబత్తెంలేని పనిమనిషిగా బతకడం నా వల్ల

కాదు. నా పేర్న ఓ యాభై డిపాజిట్ చెయ్యండి!

ఇవాళ ఆఖరు రోజు. పాత్రధారులందరూ కలిసి నటించే పూర్తిస్థాయి నాటకం నేడే.

పూలదండ, మిఠాయి పొట్లాలు శ్రీరాములు కొట్లో దాచి, రోజూ వెళ్ళే కొత్తపేట మలుపును దాటేసి, మార్కెట్టు వైపుకు వచ్చి ముప్పయివ నెంబరు బస్సు ఎక్కాను. ఎంత టెన్షను! ఎంత ఉద్వేగం! నేను చెయ్యబోయే ఈ సాహసాన్ని ప్రపంచం హర్షించదు. పిచ్చివాడేమో అని అనుమానం వ్యక్తం చేస్తారు. 'దగుల్బాజీ వెధవా!' అంటూ కొడుకులు ముఖం మీదే తిట్టవచ్చు. 'మీరు పోయినా బాగుండేది' అంటూ శ్రీమతి మెటికలు విరుస్తుంది. అయినా సరే ఈ పని జరిగిపోవాల్సిందే...

"ఒరేయ్ చంద్రం! ఏమిట్రా ఈ రాబిన్‌హుడ్ వేషాలు?" మనసు లోపల గిరీశం గాడు (అంతరాత్మ గాడు) గగ్గోలు పెడుతున్నాడు.

"అప్పారావు పంతులుగారూ! చూడండి! చూడండి! మీ సౌజన్యారావు పంతులికి దీటైన పాత్ర సృష్టించేను.... ఆ లోకం నుండి ఆశీర్వదించెయ్యండి బాబయ్యా!"

"పిల్లల మాటేమిటి? (ముఖ్యంగా చివరి ఇద్దరు) ముసిల్ది, ముప్పయి ఆరేళ్లపాటు అక్షరాలా థర్టీసిక్స్ ఇయర్స్ కలిసున్న సహధర్మచారిణి దాని మాటేమిటి?" గిర్రడు మళ్లీ కొశ్చన్ వేశాడు.

"తాంబూలాలిచ్చేశాను. తన్నుకు చావమను!" తెల్లమీసాలు మిలమిలలాడగా గుంభనంగా నవ్వుకున్నాను.

"మాష్టారూ! చివరి స్టేజీ వచ్చింది దిగండి" కండక్టరు గుర్తు చేశాడు. "నీ బొంద! ఆఖరి స్టేజీ ఏమిటి! అసలు ప్రయాణం ఇప్పుడే మొదలైతే...." అనుకుంటూ శ్యామలనగరం మెయిన్‌రోడ్డు గుండా, ఎన్.జి.వో. కాలనీ దాటుకుంటూ వెళితే, అక్కడ విశాలమైన అయిదెకరాల స్థలం మధ్యలో గోడల వరకూ లేచిన గృహ సముదాయాలు, తాపీ మేస్త్రీకి క్లాసు లాగించేస్తున్నాడు రమణయ్య మాష్టారుగాడు.

"నరసింహం! ఇది పిల్లా మేకల్తో ఎంజాయ్ చేయడానికో, అద్దె కిచ్చుకోడానికో కట్టుకుంటున్న బిల్డింగ్ కాదు. ముసలీ ముతకలు, కొడుకులు కోడళ్ళు ఛీకొట్టిన వాళ్లు, దిక్కులేని వాళ్లు అతడెవరో, మహాకవి అన్నట్లు అనేకులింకా, అసహాయులంతా, అభాగ్యులంతా ఉండడానికి కడుతున్న ఇల్లు, అయిదుగురు ముసలి వెధవలు రక్తాన్ని, చెమటని కూడగట్టి, కూడగట్టి సంపాదించిన డబ్బుతో కడుతోంది ఇది పవిత్రమైన కార్యంరా! దేవుడు పనిలాంటిదిరా!" క్షణాల్లో రమణయ్యగాడు ఎమోషనల్‌గా అయిపోయాడు.

"ఒరేయ్ నరసింహులూ! ఇంతవరకూ స్లాబ్‌పని కూడా కాలేదు. డబ్బులు మాత్రం వేలకు వేలు దండుకుంటున్నావు. ఇది పూర్తికాకుండానే ఆ కాసిని డబ్బులూ అయిపోతాయి. ఆనక, ఒరేయ్ నరసింహా! ఈ గోడల మధ్యే అయిదుగురు ముసలి వెధవలం ఉరేసుకు ఛస్తాం!"

ప్రసూనాగాడు (ప్రజ్ఞ సూర్యనారాయణ) కంగారుగా వాణ్ణి ఆపాడు "రమణా! ఏమిటీ ఆవేశం! పాపం ఆ అబ్బాయిమాత్రం ఏం చేస్తాడు! బేలుదార్ల తీరే అంత! ఉద్రేకపడి లాభమేముంది!"

పక్కనే రాళ్లపైన కూర్చున్న కేశవరెడ్డి గుర్రుగా చూసి, పెదవి విరిచి "అబ్బే ఇట్లాగయితే ఆ బి.పి. తగ్గేనా? పాడా?" అన్నాడు గంభీరమైన డాక్టరు ముఖంపెట్టి రమణయ్య నుద్దేశిస్తూ మేస్త్రీ నరసింహం "మాష్టారూ! మీ స్టూడెంటుని. మీకే ద్రోహం చేస్తానా? అన్ని పనులు ఆపుకొని మీ పనులే చేస్తాను. దీపావళి నాటికి బిల్డింగ్ మొత్తాన్ని మీ చేతుల్లో పెడతాను". పాపం వాడికి ఏడుపే తక్కువ. రమణయ్యా! మజాకా! బళ్లో హిట్లర్ రావు వాడి ముద్దు పేరు.

వణుకుతున్న చేత్తో మొత్తం మూడు లక్షల అరవైవేల రూపాయల చెక్కును రమణయ్య చేతుల్లో పెట్టాను. "చంద్రం! ఏమిట్రా ఈ సాహసం! మేమంటే ఏ బాధ్యతలూ లేనివాళ్లం. నావి అమెరికా డాలర్లు. కేశవరెడ్డిగాడు పేషంట్ల దగ్గర పీల్చినవి, జగన్ గాడివి హర్షద్ మెహతా బ్రాండు డబ్బు. ఇక నారాయణగాడా, వాడు 'ఏకో నారాయణ'. దేవుడి కెందుకో వాణ్ణి పరీక్షించాలనిపించి, అందర్నీ యాక్సిడెంట్ రూపంలో తీసుకెళ్లాడు. నీ పరిస్థితి అట్లా కాదే! చివరి వాళ్ళిద్దర్నేం చేస్తావు? షుగరు పేషంటు ఆ ముసిల్దాన్నేం చేస్తావు? పోనీ ఓ లక్ష ఇచ్చి మిగతావి ఇంటికి తీసుకెళ్లు"

"రమణా! అంతా ఆలోచించుకొనే వచ్చాను. పిల్లల కొచ్చిన ఇబ్బందేమీ లేదు. ఆఖరుదాన్ని చేసుకోవడానికి వాళ్ల మేనమామ కొడుకు రెడీగా ఉన్నాడు. ఇక చివరి వాడి గురించి నా బాధ్యతేం లేదు. చదువు చెప్పించాను. అంతవరకే నా బాధ్యత. ఇంక ముసిల్దా, అదీ ఇక్కడ కొచ్చి పడుంటుంది. ఇక ఆలోచించేదేం లేదు. కాదన్నారంటే నేను చచ్చినంత ఒట్టు!' అన్నాను శాంత గంభీరంగా. (గురజాడ అప్పారావుగారు! గమనిస్తున్నారా? సౌజన్యారావు పంతులు ఇన్‌ఏక్షన్)

ఆ తరువాత సుమారు గంటసేపు హోరాహోరి యుద్ధం తరువాత ఒక ఒప్పందాని కొచ్చాము. మూడు లక్షలు 'అభయ' ఖాతాకి. అరవైవేలు ఇంటికి. అందులో యాభై పిల్ల పెళ్లికి, పది నా కవితల పుస్తకం వేసుకోడానికి, (నలుగురు మెచ్చుకున్న ఓ మోస్తరు కవిని నేను, చూ॥ అరవైల్లో 'భారతి' సంచికలు).

* * *

"ఇప్పుడు ప్రపంచాన్ని పాలించేవి మూడు శక్తులు. ఒకటి డబ్బు, రెండు డబ్బు, మూడు కూడా డబ్బు అని బీనాదేవి గారు కాబోలు అన్నారు. ఎంత కరెక్టుగా చెప్పేరు మాష్టారు! నా చొక్కా కాలరు పట్టుకొని, కడుపులోని ఉక్రోషం పైకి తన్నుకు వస్తుంటే ఒక్క ఊపున నన్ను గోడకు ఈడ్చి కొట్టి.... అవున్సార్ నా కొడుకే. పాతికేళ్ల పాటు గుండెలపై పెట్టుకొని సాకినందుకు. పుణ్యలోకాల్లో ఉన్న నా తల్లిని తిట్టి.... ఇవి కన్నీళ్ళే. ఇది భరింపరాని దు:ఖమే. ఏమిట్రా ఇది పసివాడిలా...." అంటూ రమణయ్యగాడు ఓదారుస్తున్నా, పొగిలి పొగిలి వచ్చేది ఇది దు:ఖమే.

నా చేతులు కట్టివేసి, గదిలో బంధించి 'ఈయన పిచ్చివాడు' అంటూ డాక్టరుతో సర్టిపై చేయించారు కానీ సమయానికి మా కేశవరెడ్డిగాడు వచ్చి ఆ ఆపద గట్టెక్కించాడు. బంధువులతో, నలుగురు పెద్దలతో పంచాయితీ పెట్టించి, పెన్షన్ డబ్బు ముసిల్దానికి వచ్చేలా అథరైజేషన్ రాయించుకున్నారు. "ఇక ఇక్కడెందుకు, ఆ సన్నాసుల మధ్యే తగలబడు!" అంటూ వాళ్ళ హృదయపు తలుపులు నా ముఖం మీదే మూసేసుకున్నారు.

* * *

"మమ్మల్ని మీ 'అభయ'లో చేర్చుకుంటారా?" యాభైఏళ్లు ఉంటాయేమో ఆవిడకి. 'వయసు వచ్చిన నర్గీస్‌లా ఉంది. కళ్లనిండా పొగరు, అల్లరి, దిగులు మేఘాలేవో ముసురుకొన్నా, కళ్లలోని ఠీవిని మాత్రం దాచలేకపోతూంది. పక్కనే కూతురు కాబోలు ఆధునికంగా ఉంది. జడలాంటి బంధనాలేమీ లేకుండా భుజాలపై జుట్టు స్వేచ్ఛగా ఆడుకొంటోంది. ముఖంపై పెద్దగా మేకప్ లేదు. కనీసం బొట్టు కూడా లేదు. కానీ అదే పొగరు, అదే నిర్లక్ష్యం. కళ్లలో మాత్రం వయసు తెచ్చే వింత చిలిపితనం మిలమిల లాడుతోంది. 'బరసాత్' కాలం నాటి 'నర్గీస్'లా సమ్మోహనంగా ఉంది.

"మమ్మల్ని మీ 'అభయ'లో చేర్చుకుంటారా? మాకో తమ్ముడు కూడా ఉన్నాడు. ఈసారి జూనియర్ నర్గీస్ అడిగింది. "నాకూ, అమ్మకూ చిన్న చిన్న ఉద్యోగాలున్నాయి. ఇక్కడ ఉండనిస్తే చాలు, పోషణ అవసరం లేదు"

రమణయ్య విసుగ్గా "దీన్ని లాడ్జింగ్‌గా మార్చే ఆలోచన మాకు లేదు. పనుల హడావుడిలో ఉన్నాము. ఇంక మీరు వెళ్లొచ్చు"

ఆ అమ్మాయి చిన్నబుచ్చుకుంది.

"క్షమించండి. పసిది సరిగ్గా చెప్పటం తెలియదు దానికి. మా అబ్బాయి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ మధ్య మరీ వైలెంటుగా అయిపోయాడు. రోజంతా ఇంట్లో కట్టేసే ఉంచాల్సి వస్తుంది. అద్దెకు ఇచ్చినవాళ్లు ఖాళీ చెయ్యమంటున్నారు. చాలా ఇళ్లు ట్రై చేశాము కానీ, ఎవరూ అలాంటి పిల్లాణ్ణి ఇంట్లో పెట్టుకోలేము అంటున్నారు" సీనియర్ నర్గీస్ కొంచెం దిగులు స్వరంతో అడిగింది.

ఆమె మాటలు రమణయ్యను పెద్దగా కదిలించలేదు. "కుదరదమ్మా!" అంటూ తేల్చివేశాడు.

నర్గీస్ లిద్దరూ మౌనంగా నడుచుకుంటూ వెళ్లిపోయారు.

"మనకో మేట్రనూ, అకౌంటెంటు కావాలనుకుంటున్నాం కదా! కావాలంటే వాళ్లనా ఉద్యోగాల్లో చేరి, అవుట్‌హౌస్‌లో ఉండమను"

కేశవరెడ్డి కొసమెరుపుతో నర్గీస్‌ల ముఖాల్లో చిరునవ్వులు వెలిగాయి. మాలతి, విమల ఆ తల్లీ  బిడ్డల పేర్లని అప్పుడే తెలిసింది.

దీపావళి నాడు యాభై మందితో 'అభయ' ప్రారంభమైంది. మొదటిరోజు అంతా కంగారు, కొత్త కాందిశీకుల శిబిరంలా ఉంది. వాళ్ల ముఖాల్లో ఇంకా ధైర్యం చిక్కబడలేదు. ఈ ఆశ్రయం శాశ్వతమేనా, అనే సందేహం. ఇది తమదే అన్న భావం ఇంకా కలగలేదు వాళ్లలో. ఓల్డేజి హోమ్ ప్రారంభించటమే ముఖ్యం అనుకున్నాము కానీ, అసలు కష్టం అంతా దాన్ని నడపటంలోనే ఉందనిపించింది. వాళ్లకు తిండి వసతి, రిక్రియేషన్, ఖాళీగా ఉండకుండా ఏదైనా పనుల్లో వాళ్లను ఎంగేజ్ చెయ్యటం, ఓరి దేవుడా, ఇంత పని ఉందా అనిపించింది. ముఖ్యంగా వాళ్లల్లో తాము అనాథలమనే భావం పోగొట్టాలి. వాళ్ల మనసుల్లోని ఖాళీ అరని నింపటం ఒక పూటలోనో, రోజులోనో అయ్యే పనికాదు.

మాలతి సమయానికి ఆదుకొంది. ఒక్క తనే - పది రూపాల్లో ప్రత్యక్షమైంది. వంట వ్యవహారం తెలిసిన పదిమందిని వెంట వేసుకుని కేటరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. నర్సరీ

నుంచి ఆకుకూరల, కాయగూరల మొక్కల్ని తెప్పించి, ఖాళీ స్థలాల్ని పచ్చని స్వప్నాలతో నింపింది. వైరు బుట్టలు, పూలబుట్టలు, కాగితం బొమ్మలు కాదేది పని కనర్హం అంటూ వాళ్లకు పనులుపురమాయిస్తూ పని వాతావరణాన్ని ఏర్పాటు చేసింది. అటు కృష్ణ రాయబారం, ఇటు కాటిసీను మధ్య మధ్యలో సినిమా పాటలు, జానపదాలు, ఖవ్వాలీలు రాత్రి తొమ్మిది దాటితే చాలు అందరూ అక్కడే. అక్కడ కూడా మాలతే. క్రమంగా మేము అయిదుగురం ఆమె అమ్మతనపు ఆకర్షణలోకి వెళ్లిపోయాము.

ఒక సాయంత్రం నాలుగు గంటలవేళ ఎర్ర మారుతీ కారొకటి 'అభయ'కు వచ్చింది. అందులోంచి భారీ కాయం దిగింది. వస్తూనే మాలతి ఎక్కడా అంటూ వాకబు చేశాడు. ఇతన్నెక్కడో చూశానే అనిపించింది. "ఒరే రమణా! ఎవరా కారున్న ఆసామి? కళ్లలో దర్పం, కోపం, పరిసరాల మీద అసహనం అసెంబ్లీ నుండి పారిపోయిన బాపతులా ఉందే?"

రమణగాడు నా అనుమానం నిజం చేశాడు. "ఆనవాలు బాగానే పట్టావు. ట్రేడ్ యూనియన్ నాయకుడు వెంకటపతి. రాజ్యసభలో సిటింగ్ ఎం.పి."

కానీ మాలతితో వీడి చుట్టరికమేమిటి? మాలతి వీణ్ణి చూసి బిక్కచచ్చిపోవటమేమిటి? ఎలుకను నోట కరుచుకొన్న పిల్లిలా వీడి ముఖం అలా వెలిగిపోతుందేమిటి?

పని ఉన్నట్లుగా విమల హడావుడిగా బయటకు వెళ్లింది. మాలతి గదిలో చాలాసేపు నిశ్శబ్దం. సన్నగా మొదలై కుంభవృష్టి అనిపించేలా మాలతి రోదన మా గుండెల్ని తాకుతూనే ఉంది. రెండు నిముషాల తరువాత హఠాత్తుగా తలుపు తెరుచుకుంది. తూలి బయటపడబోయాడు ఆగంతకుడు. "పశువా! మళ్లీ నా గడప తొక్కకు!" అది మాలతి కంఠమే. రుద్రనేత్రంలా, జ్వాలా కీలంలా నిలబడి ఉంది మాలతి.

ఆగంతకుడు వెళ్లిపోయాక, మాలతి గదిలోకి వెళ్లి తలుపు బిగించుకొంది. "అమ్మను కాస్త ఓదార్చండి!" విమల వచ్చి బతిమలాడింది. "ఆర్నెల్లకో, సంవత్సరానికో ఇదో తద్దినమై పోయింది. అమ్మ సంగతి తెలిసి కూడా ఆ మనిషి తన ప్రయత్నం మానడు. ఆ తలుపులు శాశ్వతంగా మూసుకున్నాయని తెలిసి కూడా పదే పదే వస్తాడు. తన కారు, తన బంగ్లా, తన హంగు, అంతస్తు అమ్మను కరిగించకపోతాయా అని అతని భ్రమ. ఈ మగవాళ్లింతే. ఏళ్ల తర బడి కలిసి ఉన్నా తమ స్త్రీల మనసుల్ని తెలుసుకోలేరు" స్వగతంలాగే గొణిగింది విమల.

వింత ప్రశ్నలేవో మా చూపుల్లో కనబడి "అవును అతను మా అమ్మకు భర్త. నాకూ, రాజాకూ జన్మనిచ్చిన వాడు కూడా తనే" విమల క్రమంగా ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్లింది.

"వెంకటపతి ఆదర్శాలకు మురిసి, తన కుటుంబాన్ని సైతం త్యజించి అతని చెయ్యి పట్టుకుని వధువై తరలి వచ్చింది అమ్మ. నా చిన్నతనంనాకింకా గుర్తు. మా ఇల్లు విప్లవాల పురిటిగదిలా ఉండేది. అర్ధరాత్రి వరకూ చర్చలూ, మీటింగులూ కనీసం పదిమందైనా ఉండేవాళ్లు ఆయన చుట్టూ. ఆయనంటే నడిచే దైవం వాళ్లకు. ఖద్దరు లాల్చీ, పైజామా, భుజాన సంచీ, తిండి వసతి సరిగా లేక ఎండిపోయిన ఎముకల గూడులా ఉండే ఆ మనిషిని చూస్తే మాకు గర్వం వేసేది.

"ఆదివారాలైతే మా ఇంటినిండా గుంపులు గుంపులుగా జనం. ఆ ఫ్యాక్టరీలో కార్మికులో, ఈ పల్లెలో రైతు కూలీలో నాన్నతో తమ కష్టాల్ని చెప్పుకుంటూ, ఆ రోజంతా అమ్మకు

ఎడతెగని పని. వాళ్లకు కాఫీ, టీ లిస్తూ నాన్నను అలా జనం మధ్యన చూస్తుంటే అమ్మకెంతో మురిపం. అప్పట్లో ఇంట్లో దుర్భర దారిద్ర్యం ఉండేది. అయినా అమ్మదాన్ని లెక్కచేసేది కాదు.

"ఒకరోజు ఉదయం ఒక ముసలి కార్మికుడు కూతుర్ని తీసుకుని అమ్మ దగ్గరకు వచ్చాడు. వాళ్లేం మాట్లాడుకున్నారో తెలియదు. కానీ అమ్మ పెద్ద పెట్టున ఏడవటం నాకింకా గుర్తే. ఆ హడావుడికి నాన్న నిద్రలేచి నట్లున్నాడు. కళ్లు ఎర్రగా ఉన్నాయి. "తప్పయిపోయింది మాలతీ! బాగా తాగి ఉన్నానేమో ఆ క్షణంలో నేనేం చేస్తున్నానో అర్థం కాలేదు. ఆ అమ్మాయిని చూసి నువ్వే అనుకొన్నాను. ఆ అమ్మాయి పెనుగులాడుతూనే ఉంది. అన్నా! అన్నా! అంటూ ఏడుస్తూనే ఉంది. కానీ ఆల్కహాల్ మత్తులో...." "ఏం చేస్తావిప్పుడు? ఆ పిల్లనేం చేస్తావు?" అమ్మ పెద్దగా అరిచింది. "చెయ్యడానికేముంది?" ఆయన నీళ్లు నమిలాడు. "వందో, రెండొందలో ఇచ్చి..." ఆయన మాటలు పూర్తి కాకముందే ఈడ్చి చెంపకేసి కొట్టింది అమ్మ. అట్లాగే నేలకు కూలబడి ఏడుస్తూంది. ముసలి తండ్రీ, కూతురు పశ్చాత్తాపంగా అక్కడి నుండి వెళ్లిపోయారు. ఓదార్చబోయిన నాన్నను "నన్ను ముట్టుకోకు. ఇన్నాళ్లు నీతో కాపురం చేసినందుకు సిగ్గుపడుతున్నాను. ఫో అవతలికి...." ఆ రాత్రే అమ్మ నన్ను తమ్ముణ్ణి తీసుకుని బయటకు వచ్చేసింది.

ఈ విడిపోవడం వల్ల తమ్ముడు బాగా నలిగిపోయాడు. వాడు ఆయనకు బాగా దగ్గర ఆయనతోపాటు మీటింగులకు వెళ్లేవాడు. అక్కడ కార్మికుల గురించి పాటలు పాడేవాడు. 'చిన్నవయసులోనే పెద్ద పెద్దమాటలు మాట్లాడటం నేర్చుకున్నాడు. గత రెండేళ్లుగా వాడిలో మానసిక వ్యాధి లక్షణాలు వచ్చేశాయి. ఉండీ ఉండీ 'విప్లవం వర్థిల్లాలి' అంటూ పెద్దగా అరుస్తాడు, ఏడుస్తాడు, నవ్వుతాడు. 'పదండి ముందుకు, పదండి తోసుకు' అంటూ పిచ్చిగా అరుస్తాడు. 'ఆరోగ్యవంతమైన కుటుంబ జీవితం అవసరం వాడు బాగుపడడానికి' అని డాక్టర్లు చెప్పినా "వాడు నాకు దక్కకపోయినా ఫరవాలేదు. ఆ మనిషితో మాత్రం కాపురం చెయ్యటం కల్ల!" అంటుంది అమ్మ.

ఆయన ఇలా సంవత్సరానికి, ఆర్నెల్లకీ వస్తూనే ఉంటాడు. 'నన్ను క్షమించు, కలిసి బ్రతుకుదాం, రా' అంటాడు. అమ్మ సమాధానం మీరు ఇందాక విన్నదే" అంటూ విమల ఫ్లాష్‌బాక్ ముగించింది.

మేము ఓదార్చకుండానే మాలతి తేరుకుంది. రాత్రి భోజనం ఏర్పాట్లకై వెళ్లింది.

* * *

మళ్లీ దీపావళి వచ్చింది. ఇవాల్టికి సరిగ్గా సంవత్సరం 'అభయ' పుట్టి. పొద్దున్నే నిద్ర లేచేసరికి సందడి సందడిగా ఉంది. సన్నటి నాదస్వరం గుండెలో తడితడిగా తగులుతోంది. నిద్ర లేవాలనిపించలేదు. కలలన్నీ కొట్టుకుపోయినట్లుగా ఒంటరితనం, శూన్యం. నిజానికి ఆనందంతో గడపాల్సిన రోజు. సాధ్యం కావటంలేదు. నిన్న సాయంత్రం పెద్దకొడుకు మూర్తి వచ్చాడు. "ఆర్థికమైన ఇబ్బందుల్లో చిక్కుకున్నాను. గత్యంతరం లేక ఒక పాపం చేశాం. పెద్ద మనసు చేసుకోండి! అమ్మ కూడా సరే అంటేనే ఈ పని చేశాను. ఇన్సూరెన్స్ ఆఫీసులో ఫ్రెండు ఒకడున్నాడు. వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టి సర్టిఫికెట్ కూడా సంపాదించాము" వాడు చెబుతుందేమిటో అర్థం కాదు. "సంగతేమిట్రా?" అన్నాను విసుగ్గా. "మీవి మూడు ఇన్సూరెన్స్

పాలసీలున్నాయి కదా! మీరు పోయారని....." వాడేమీ చెబుతున్నాడో అర్థం అయ్యేసరికి గుండెలు పిండినట్లయింది. పెను దుఃఖం రగిలి నేను కన్నీరు మున్నీరయి....

"చంద్రం! ఏమిటిది ఇంకా నిద్రలేవలా?" మాలతి కాఫీ పట్టుకొని వచ్చింది. ఆమెను చూడగానే మళ్లీ దుఃఖం వేసింది. రెండు చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చాను.

"చంద్రం! ఏమైంది?"

"ఎందుకో వంటరిగా అనిపిస్తోంది. ప్రపంచంలో నాదంటూ ఏమీ లేదనిపిస్తోంది. నేను చచ్చిపోయానని డెత్ సర్టిఫికెట్ పుట్టించి ఇన్సూరెన్స్ క్లైము అడిగారట నా పిల్లలు. అనుబంధాలూ, ఆప్యాయతలూ అంటూ పాకులాడిన రోజులన్నీ గాయాల్లా మెలి పెడుతున్నాయి. నేనంటే ఏమిటి? రెపరెపలాడే నోట్లకట్టను. వస్తువులు పేర్చిన స్టోర్‌రూమును. ఎవరికి కావలసినవి వాళ్లు పట్టుకుపోయారు. వాళ్ళ వస్తు ప్రపంచంలో నాకు విలువ లేదు. నా చావుకే విలువుంది."

"ఇలాంటి దుర్మార్గ ప్రపంచం కోసం నీ కన్నీళ్లు వృధా చేసుకోకు. ఇదుగో ఈ అయిదెకరాల స్థలం. మధ్య ఉన్నదే నీ అసలైన ప్రపంచం. దిగుల్ని వదిలేసి బయటి కోలాహలంలోకి రా! వాళ్లలో నీకు నీ కన్నతల్లి కన్పిస్తుంది. వాళ్ల స్పర్శతో మళ్లీ నీ బాల్యం చిగురిస్తుంది" రెక్క పట్టుకుని బయటకు తీసుకొచ్చింది మాలతి.

కొత్త బట్టలతో మిలమిలా మెరిసిపోతున్నారందరూ. రంగు రంగుల తోరణాలు, ఆ మూలనొక పాట, ఈ మూల నొక కేరింత ఎటు చేసినా ఆనందమే. పండుగే. క్రమంగా ఆనందపు అర్ణవంలోకి ఇమిడిపోయాను. రాత్రికి ఫంక్షన్ ఉన్నట్లుంది. ఒకచోట నాటకం ఒకచోట పాటలూ ప్రాక్టీసు చేస్తున్నారు. మధ్య మధ్యలో హార్మోనియం, తబలా శబ్దాలు. "ఆ కుర్చీలు ఆ.... అటు... జరపండి...." రమణయ్యగాడు పెద్దగా అరుస్తున్నాడు. "ఇదేమిటోయ్ ఈ ఆకుపచ్చరంగు కర్టెను. నీకు బొత్తిగా ఈస్థటిక్ సెన్స్ లేదురా రమణా!" కేశవరెడ్డి కునుస్తున్నాడు. అటు ఇటు పరిగెడుతున్న కాలి మువ్వల చప్పుడు అవి విమలవి. "శక్తికై నడు... విముక్తికై నడు...." విరిగిన కెరటాల చప్పుడులాంటి ఆ పాట రాజాది. వాడిని తాళ్లతో కట్టివేసి ఇంట్లో బంధించటంలేదు. వాడిలో చాలా మార్పు వచ్చింది.

"నాతో మాట్లాడ్డమే గొప్ప ఎడ్యుకేషన్!" ఉలిక్కిపడ్డాను. ఎక్కడి నుండి ఊడిపడ్డాడీ గిరీశం. సాయంకాలం ఫంక్షన్‌కి ప్రాక్టీసు చేస్తున్న నాటకం, కన్యాశుల్కంలా ఉంది. అప్పారావు పంతులుగారూ! ఈ గిరీశాల ప్రపంచాన్ని వందేళ్ల క్రితమే ఎలా ఊహించావయ్యా.

"ఇంకా నిద్రమొహమేనా? వెళ్లి స్నానం చేసిరా! ఈరోజు పండగంతా నీదే! ఇవాళ సాయంత్రం నీ కవితా సంకలనాన్ని ఆవిష్కరించబోతున్నాం" అంది మాలతి.

వస్తు ప్రపంచానికి సమాధానం ఇలాంటి మాలతేననిపించింది.

*ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక*

*ఫిబ్రవరి 15-21, 1995*